# సింగిల్ పేజీ కథలు

## భయం భయం!

రాత్రి ఎనిమిది గంటల సమయం. మేడ మీద గదిలో చదువుకుంటున్నాను. ఎం.ఏ. పరీక్షలు వారం రోజుల్లో ప్రారంభమౌతున్నాయి. కింద వంటింట్లో అమ్మ వంట చేస్తోంది. నాన్నగారు క్లినిక్ నుండి ఇంకా రాలేదు. తమ్ముడు స్నేహితులతో కలిసి సినిమాకెళ్లాడు. వాడి డిగ్రీ పరీక్షలు నిన్నటితో ముగిసాయ్. ఈ రోజు నుండి వాడికి ఆటవిడుపు!

పట్టణం శివార్లలో ఉన్న కాలనీ మాది. సాయంత్రం ఏడో గంట అయ్యేసరికి ప్రశాంతత సంతరించుకుంటుంది.

హఠాత్తుగా నిశ్శబ్దాన్ని భంగ పరుస్తూ 'ఉహూ, ఉహూ' ఓ విచిత్రమైన కూత వినిపించింది! ఒక్కసారిగా నా ఒళ్లు జలదరించింది. ఆ కూత గూడ్లగూబ ఊళలా తోచింది. 'ఎక్కడ నుండి చెప్మా? చుట్టు పట్ల ఎక్కడా చెట్లు కూడా లేవాయే! కొంపదీసి ఏ దెయ్యమో, పిశాచమో ఇంట్లో జొరబడలేదు కదా! నేను భ్రమ పడ్డానేమో! ఈ రోజుల్లో దెయ్యాలూ, భూతాలూ ఏమిటి?' నాలో అనేక సందేహాలు. ధైర్యం కూడదీసుకోడానికి ప్రయత్నం చేస్తున్నాను. సగం చదివి టేబుల్ మీద బోర్లా పెట్టిన షేక్స్పియర్ డ్రామాల పుస్తకం కనిపించింది. షేక్స్పియర్‌లాంటి మహానుభావుడే దెయ్యాలను తన నాటకాలలో ప్రవేశపెట్టాడు. ఏమో! దెయ్యాలు ఇప్పుడూ ఉన్నాయేమో!

'ఆc! ఈ రోజుల్లో మనుషులే బ్రహ్మరాక్షసుల్లా తయారౌతున్నారు! ఇంకెక్కడ దెయ్యాలు? ఎలక్ట్రిక్‌పోల్ మీద కూర్చుని ఏదో పిట్ట కూసి ఉంటుంది' ధైర్యం చిక్కబట్టుకున్నాను. మళ్లీ వినిపించిందా ధ్వని. తిరిగి భయం ఆవహించింది!

గత సంవత్సరం ఇలాగే ఇంటి పక్క ఎలక్ట్రిక్ పోల్ మీద గూడ్లగూబ కూర్చుని అర్ధరాత్రి అరవడం ప్రారంభించింది. తెల్లవారే సరికి తాతగారు చనిపోయారు! ఆర్నెల్లుగా జబ్బుతో మంచం పట్టి ఉన్నారు అప్పటికే! అయినా అంత హఠాత్తుగా చనిపోతారనుకోలెదెవ్వరూ. ఇలా నా ఆలోచనల్లో నేనుండగా మరో వింత ధ్వని వినిపించింది. ఈసారి గుడ్లగూబ ఊళ కాదు నక్క అరుపులా ఉంది. నా ఒళ్లు మరింత బిగుసుకుపోయింది భయంతో. మా తాత గారిది పల్లెటూరు. శీతాకాలంలో గుంపులు గుంపులుగా అరుస్తాయి. భయంతో అమ్మమ్మని కౌగిలించుకుని పడుకునేదాన్ని నక్కల అరుపులు విని భయపడి.

నాకు చదువు మీద మనసు పోవడం లేదు. ఆలోచిస్తూ కూర్చున్నాను. ఈసారి కుక్క మొరిగినట్టు, మరో కుక్క 'కుయ్యో'మని మూలిగినట్టూ వినిపించింది. భయంతో నా ఒంటికి చెమట్లు పట్టేయి. ఇలాగే ఓసారి కుక్క మూల్గగానే దుక్కలా ఉన్న మా నాన్నమ్మ గుటుక్కుమంది హఠాత్తుగా. ఈ కుక్క మూల్గులూ, గుడ్లగూబ ఊళలూ అశుభ సంకేతాలని మా తాతమ్మ చెప్తూ ఉండేది. ఇదేమిటి చెప్మా, ఇలా ఇన్ని అశుభ సంకేతాలు వినబడుతున్నాయి? తర్వాత, వరుసగా పిల్లీ, కాకీ, కోడీ కూతలు వినిపించాయి. అన్ని అరుపులు విన్న తర్వాత నా మనసు కాస్త కుదుట పడింది. వీధిలో పిల్లలెవరైనా అరుస్తున్నారా అన్న అనుమానంతో చెవులు రిక్కించి జాగ్రత్తగా వినడానికి సిద్ధమయ్యాను.



మళ్లీ వినవచ్చేయి అరుపులు! సందేహం లేదు! పక్షులూ, జంతువులవీ కావు ఆ అరుపులు! వంటింట్లో అమ్మ తప్ప చిన్న పిల్లలెవరూ లేరు. కొంపతీసి అమ్మ మీద ఏ దెయ్యమో పిశాచమో వాలిందా ఏమిటి? మా తాతగారి పల్లెలో అప్పుడప్పుడూ ఒక్కో స్త్రీ అరుపులూ, బొబ్బలూ పెడుతూండే వారు. అమ్మమ్మ చెప్తూ ఉండేది వాళ్లని దెయ్యం ఆవహించిందని. అమ్మని దెయ్యం ఆవహించిందా? భయంతో ఒళ్లు బిగుసుకుపోయింది! క్రిందకు దిగి వెళ్లాలని ఉంది కానీ కుర్చీలోంచి లేవ లేకపోతున్నాను. అమ్మని పిలుద్దామని ప్రయత్నం చేస్తున్నాను కాని గొంతులోంచి మాట వెలువడడం లేదు. కష్టపడి కంఠం పెగుల్చుకుని 'అమ్మా, అమ్మా!' అని కేకేసాను. జవాబు రాలేదు! ఒళ్లు స్వాధీనం చేసుకుని ఒక్కొక్క మెట్టూ దిగి వంటింటి దగ్గరకొచ్చాను. ఇంకా రకరకాల అరుపులు వినవస్తున్నాయి. మధ్య మధ్యలో కూర వేపుడూ 'చుయ్ చుయ్'మని నేపథ్య సంగీతంలా వినబడుతోంది. నాకేమీ అర్థం కాలేదు.

ఎలాగోలా ధైర్యం కూడదీసుకుని వంటింట్లో కాలు పెట్టాను. అమ్మ గ్యాస్ స్టౌ మీద ఒక పక్క అన్నం కలుపుతూ, మరో పక్క కూర వేపుతూ కుక్క కూతలూ, నక్క కూతలూ కుస్తోంది!

"అమ్మా! ఏమిటే ఈ అరుపులు?" అన్నాను ఆశ్చర్యంగా.

"మరేం లేదే! మా మహిళా సమాజంలో రేపు మిమిక్రీ చేయబోతున్నాను. అందుకని ప్రాక్టీసు చేస్తున్నాను. నాన్నగారూ, తమ్ముడూ ఇంట్లో లేరు. ఈ సమయమే అనువుగా ఉంటుందని ప్రాక్టీసు చేస్తున్నాను. ఇంతకీ నా అరుపులు జంతువుల అరుపుల్లా ఉన్నాయా లేవా? చెప్పు" అంది అమ్మ చేతిలో అట్లకాడతో వీర పోజు పెట్టి.

"చంపావు కదే అమ్మా! నీ అరుపులు కాదు గాని భయంతో చచ్చిపోయాను! చాలా బాగుంది నీ మిమిక్రీ!!" అన్నాను తేలికైన మనసుతో.

**-ఉపద్రష్ట బాలాత్రిపురసుందరి**
(బరంపురం)

○ ○ ○

"అమ్మాయ్ గిరిజా! ఒకసారి ఇలా వస్తావా" అమ్మ పిలుస్తున్నా వినిపించనట్లు వారపత్రికలో నా పేవరెట్ రైటర్ రాసిన కథను చదవటం మొదలుపెట్టాను.

"ఏయ్.. హల్లో! ఏవిటండీ గిరిజాదేవిగారు అంత సీరియస్‌గా చదివేస్తూ వున్నారు"

ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూసాను. మామయ్య వాళ్ల అమ్మాయి ఉష- "అబ్బా నువ్వా".

"మరి ఎవరనుకొన్నావే?"

"ఏమి అనుకోలేదుగాని ఐదు నిమిషాలు వుండవె, కథ మంచి పట్టులో వుంది"

"సరలే చదువుకో, ఈలోగా అత్తయ్యను పలుకరించి వస్తాను"

కథ ముగించి వంట గదిలోకి వెళ్లాను. ఉష అమ్మ ఇచ్చిన కాఫీ తాగుతోం. మా మామయ్య మేము ఒకే ఊర్లో వుండటం వల్ల నేను- అదీ చిన్నతనం నుండి ఏ అరమరికలు లేకుండా పెరిగాము మా మధ్య బంధుత్వం కన్నా స్నేహ బంధమే ఎక్కువ. అమ్మవైపు చూసి అడిగాను. "అమ్మా! నేనేమైనా చెయ్యాలా" అని.

"చాల్లేవే గొప్ప ఇందాక పిలిచినప్పుడు వచ్చేవు గనకనా, పని నీ కోసం కూర్చోటానికి. ఉష వచ్చింది కదా వెళ్లు కాసేపు కబుర్లు చెప్పు" అమ్మ నవ్వుతూ అంది.

"గిరిజా ఏమిటే కథ మంచి రసపట్టులో వుండగా వచ్చినట్లున్నాను. ఎవరే ఆ రైటర్?"

"శ్రీధర్‌గారని మంచి రైటర్ ఎక్కడా, అతుకులు ఆడంబరాలు వుండవు. ప్రతీ మనిషి మనస్సునీ అద్దంలో చూసినట్లు పాత్రలో పరకాయ ప్రవేశం చేసినట్లు అద్భుతంగా వుంటుందే అతని శైలి"

"సరేలేవే ఆ విషయం చాలా సార్లు చెప్పావుగాని, నీలా పుస్తకాల పురుగు అన్న బిరుదు నాకు లేదులే...ఇంకేమైనా కబుర్లుంటే చెప్పవే"

ఓ గంట తరువాత ఉష వెళ్తానంటూ లేచింది. "అబ్బా వుండవే తల్లి నీకో విషయం చెప్పటం మరచిపోయాను. ఈ రైటర్‌గారి అడ్రస్ తెలిసిందే. ఈరోజుగాని, రేపుగాని రైటర్‌గారు ఏ సమయంలో ఇంట్లో ఉంటారో తెలుసుకోవాలి కదా, ఫోను చేసి చెబుతాను తప్పకుండా రావాలి సుమా" అన్నాను. ఉష బై చెప్పి వెళ్లిపోయింది.

* * *

మరుసటి రోజు ఉషకు ఫోను చేసి చెప్పాను మధ్యాహ్నం 3, 4 గంటల మధ్య రైటర్‌గారి ఇంటికి వెళదాం- ఆ టైముకి నీవు తప్పక రావాలి అని.

హాలులో కూర్చొని చదువుకొంటున్న తమ్ముడు, అక్కా! ఎక్కడికే బొమ్మరిల్లు సినిమాకు ఐతే నేను వస్తానే అన్నాడు.

విషయం చెప్పి మా ఇద్దరికీ తోడుగా వాడిని కూడా రమ్మని పిలిచాను వాడు నాకన్నా 4 సంవత్సరాలు చిన్నవాడు.

అనుకొన్న టైముకి ఉష కూడా వచ్చింది. అమ్మతో చెప్పి ముగ్గురం బయలుదేరాము. ఆటోదిగి గేటుతీసి లోపలికి అడుగుపెట్టాము. ఇంతలో డోరు తీసుకొని ఓ మధ్య వయస్కుడు కళ్లు కాస్త పెద్దవి చేసి, కళ్లద్దాలు సర్దుకొంటూ ఎవరూ - ఎవరు కావాలి అంటూ అడిగాడు.

"రైటర్ శ్రీధర్‌గారండి"

"ఓ ఫోను చేసింది మీరేనా? ఆ శ్రీధర్‌ని నేనే" అంటూ ప్రక్కకు తొలగి మమ్మల్ని లోపలికి ఆహ్వానించాడు. గదంతా కలయచూస్తూ అతను కూర్చోమని చెప్పగానే ముగ్గురం సోఫాలో కూర్చున్నాము. అతను కూడా మేము అడిగిన వాటికి సమాధానం చెబుతూ కూర్చున్నాడు.

# అభిమాని

నా అభిమాన రైటర్స్ గురించి చెప్పి ఇన్నాళ్లుగా అన్వేషిస్తే ఇప్పటికి మీ ఒక్కరి అడ్రస్ మాత్రం దొరికిందండి అన్నాను. తను ఎన్నాళ్లుగా రచనలు సాగిస్తుంది ఎన్నెన్ని కథలు ఏ ఏ పత్రికలలో ప్రచురించబడ్డాయో, తనకు ఎంతమంది అభిమానులు వున్నారో ఎన్ని కథలకు బహుమతులు వచ్చాయో, ఇలా చెబుతుంటే కళ్లప్పగించి వినటం మా వంతు అయింది.

ఇంతలో వీధిలో నుండి ఓ దీనాతి దీనమైన కంఠం వినిపించింది "బాబూ.. ధర్మం చేయండి నాయనా కడుపుమాడిపోతోంది. పొద్దుటేల నుండి పిడికెడు మెతుకులు లేవు. పిల్లాడి కళ్లు తిరిగి పోతున్నాయి. ధరమ పెభువులు. తండ్రీ ఒక్క రూపాయి ఇప్పించేరంటే చాలు" అంటూ మా ముగ్గురి కళ్లు వీధివైపు తిరిగాయి. చంకలో రెండేళ్ల పిల్లాడితో, ఓ బక్కచిక్కిన స్త్రీ దీనంగా చేయిచాచి నిల్చుంది.

అంతసేపు మాతో మామూలుగా మాట్లాడుతున్న రైటర్‌గారు ఒక్కసారిగా అటు తిరిగి "ఏయ్! పోవే-పో-పో-పోతావా లేదా - చెబుతుంటే నీక్కాదా, పోవె-పో-దొంగ రాస్కెల్" అంటూ అరిచాడు.

మరుక్షణం అదే గొంతుతో మొహాన్ని అష్టవంకర్లు త్రిప్పి లోపలి గదిలోకి చూస్తూ "ఏయ్! ఎక్కడ చచ్చావే మొద్దు పీనుగా, వచ్చి ఈ కప్పు తీయవే" అంటూ గావుకేక పెట్టాడు. అంతసేపు చలనంలేని బొమ్మల్లా కూర్చొన్న మేము ఒక్కసారిగా అదిరిపోయి సోఫాలో నుండి దిగ్గున లేచాము. ఉష నా చేయి ఎప్పుడు పట్టుకుందో తెలియదు ముగ్గురం ఒక్క ఉదుటున అక్కడి నుండి బైటపడ్డాము వెనుకనుండి అతను పిలుస్తున్నా వినిపించనట్లు, వెనక్కి చూడకుండా.

"అక్కా! చూసావా మీ రైటర్‌గారి గొప్పతనం. అతని రాతలకు చేతలకూ వున్న తేడా. నీ ఫేవరెట్ రైటర్స్ ఇంకా చాలామందే వున్నారనుకొంటాను, వాళ్ల అడ్రసులు కూడా తెలుసుకోవె, వాళ్లను కూడా చూసి వద్దాము" తమ్ముడు నా వైపు చూస్తూ నవ్వుతున్నాడు.

నా మనస్సు మౌనంగా వుంది. మా అడుగులు ఇంటివైపు భారంగా పడుతున్నాయి.

"గిరిజా! ఏమిటే అంత మూడీగా వున్నావు. టేకిట్ ఈజీ. మామూలుగా వుండవె" ఉష నా చేయి వదలకుండానే అంటుంది.

నా మనస్సు అనేక విధాలుగా ఆలోచిస్తోంది. మనిషిగా కనీస మానవత్వం కూడా లేని ఇతన్నా ఇంతకాలంగా నేను అభిమానించింది? దీనులపట్ల కాస్తంత దయ జాలి కరుణ గోరంత కూడా లేని ఇతనిపట్ల నేనింత అభిమానం పెంచుకుంది? అరె ఇంట్లో ఆడవాళ్ల పట్ల కూడా కనీస సంస్కారాన్ని పాటించాలన్న జ్ఞానం కూడా లేదే? ఆశ్చర్యంగా వుంది.

అంతలోనే 'ఏయ్ అమ్మాయ్! నువ్వెంత నీ వయస్సెంత నీవు చదివేది వాళ్ల సాహిత్యాన్నా, వాళ్ల వ్యక్తిత్వాలనా వాళ్ల గుణగణాలతో నీకేం పని. నూటికో కోటికో ఏ ఒక్కరిలోనో ఏదో చిన్న లోపం వుంటే దానిని అందరికి వర్తింపచేస్తావా?' నా మనస్సు నన్నే సీరియస్‌గా కసురుకొంది.

-ఎం.సరోజిని

(విశాఖపట్నం)




